క్లుప్తంగా

నేడు నిరుద్యోగులకు అవగాహన

సోమల: మండలంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలపై మహిళా సమాఖ్య భవనంలో గురువారం అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీఎం శివ ఓ ప్రకటనలో తెలిపారు. డీఆర్‌డీఏ(చిత్తూరు) సీడాప్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణకు ఎంపిక చేసేందుకు ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని చెప్పారు. 10వ తరగతి నుంచి డిగ్రీ చదువుకున్న యువకులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



బైరెడ్డిపల్లె: స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం వార్షికోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి పూజలు చేపట్టారు. అనంతరం ఆలయం వద్ద హోమాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు రామకృష్ణమాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. వాసవీ ఫౌండేషన్ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కూలీల సంఖ్య పెంచాలి

పులిచెర్ల(కల్లూరు): ఉపాధిహామీ పథకంలో జరుగుతున్న పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఏపీఓ సౌకత్‌అలీ తెలిపారు. ఉపాధి కార్యాలయంలో బుధవారం మండలంలోని ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. ఎక్కువమందికి పని కల్పించి పనులను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. హౌసింగ్ బిల్లులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఈసీ కృష్ణ, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

బీపీ కొలిచే యంత్రం వితరణ



బీపీ కొలిచే మిషన్‌ను అందిస్తున్న దాత సురేష్

వి.కోట: మండలంలోని పత్రపల్లి హెల్త్ క్లినిక్‌కి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత సురేష్ బీపీ కొలిచే యంత్రాన్ని వితరణగా అందించారు. ఇటీవల పత్రపల్లి సచివాలయాన్ని జెడ్పీ చైర్మన్ తనిఖీ చేసినప్పుడు బీపీ కొలిచే యంత్రం లేదని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకొచ్చారు. జెడ్పీ చైర్మన్ ఆదేశాల మేరకు సురేష్ బీపీ కొలిచే యంత్రాన్ని వితరణగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం మెషీన్‌ను సచివాలయ సిబ్బందికి అందించారు.

వైభవంగా పుష్పపల్లకి సేవ



పుష్పపల్లకిపై ఊరేగుతున్న గిరిజా సమేత శ్రీకాలభైరవేశ్వరస్వామి

బైరెడ్డిపల్లె: మండలంలోని కోట్రీపల్లె సమీపంలో వెలసిన శ్రీ కాలభైరవేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పుష్పపల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. కైగల్, తీర్థం గ్రామస్తులు వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన పల్లకిపై గిరిజా సమేత కాలభైరవేశ్వరస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. తీర్థం గ్రామం నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి బుధవారం ఉదయం ఆలయం వద్దకు చేర్చగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నేతలు

గంగవరం: మండలంలోని పాతకీలపట్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం స్థానిక నాయకులు భూమిపూజ చేశారు. గ్రామానికి ఇప్పటి వరకు సీసీ రోడ్డు లేదు. గుంతలు పడిన దారిలోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే గతంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ ఈ గ్రామంలో పర్యటించినప్పుడు తమ ఊరిలో సీసీరోడ్డు వేయాలని గ్రామస్తులు కోరారు. స్పందించిన ఆయన వెంటనే నిధులు మంజూరు చేసి గ్రామాల్లో సీసీ రోడ్లు వేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కొత్తపల్లి పంచాయతీకి జీజీఎంపీ నిధులు రూ.20 లక్షలు మంజూరు కాగా, పాతకీలపట్ల గ్రామంలో రూ.6.30 లక్షలతో 163 మీటర్ల మేర సీసీ రోడ్డు వేస్తున్నారు. పంచాయతీ సర్పంచ్ గిరిరాజారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నేతలు పార్థరెడ్డి, బాలకృష్ణ, చిట్టి, విజయ్, శివన్న, వెంకటరమణారెడ్డి, శీన పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య

- అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన
- తల్లిదండ్రుల సమావేశంలో ప్రిన్సిపల్ వెంకటేశులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వెంకటేశులు

పలమనేరు: ఉన్నత ప్రమాణాలు కలిగిన నాణ్యమైన విద్యను ప్రభుత్వ విద్యాసంస్థల్లో అందుతోందని పలమనేరు ఎస్వీసీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వెంకటేశులు తెలిపారు. స్థానిక కళాశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పిల్లలు కళాశాలకు వెళ్తున్నారులే అని నిర్లక్ష్యం చేయకుండా, తల్లిదండ్రులు వారిని అనునిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన విద్యార్థులకు ఉన్నత ఉద్యోగాలు వచ్చేలా వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు తాము కృషి చేస్తున్నామని తెలిపారు. అయితే ఇందుకు తల్లిదండ్రుల సహకారం కూడా అవసరమన్నారు. విలువలతో కూడిన విద్యను తప్పక అందిస్తామని భరోసా ఇచ్చారు. కళాశాలలోని సౌకర్యాలను తల్లిదండ్రులకు చూపెట్టారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను సైతం వారి సమక్షంలో పరిశీలించారు. వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం



పుంగనూరు: వేలం వేయనున్న వాహనాలు

పుంగనూరు: అక్రమమద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలను గురువారం వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ మోహన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు 19 ద్విచక్ర వాహనాలు, ఒక కారును ఉదయం 10 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి, వేలంలో పాల్గొనాలన్నారు.

సదుంలో..

సదుం: పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను గురువారం వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ మారుతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక ఆటో, ద్విచక్రవాహనానికి నిర్వహించే ఈ వేలంలో ప్రభుత్వ నిబంధనల మేరకు ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చని చెప్పారు.

గంగవరంలో..

గంగవరం: అక్రమమద్యం రవాణా కేసుల్లో పట్టుబడి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన 10 వాహనాలకు స్టేషన్ ఆవరణలో గురువారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు ప్రవేశ రుసుం చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను 23వ తేదీ గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో బహిరంగ వేలం వేయనున్నట్లు స్థానిక పోలీసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండుకార్లు, రెండు ఆటోలు, ఒక పాల వ్యాను, 9 ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. రూ.2000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వేలంలో వాహనాలు పొందిన వారు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపిద్దాం



నామినేషన్ సందర్భంగా వైఎస్సార్‌సీపీ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థితో సోమచంద్రారెడ్డి

పలమనేరు: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపిద్దామని రాష్ట్ర యూటీఎఫ్ మాజీ నాయకులు సోమచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కేంద్రం చిత్తూరులో బుధవారం జరిగిన నామినేషన్ కార్యక్రమానికి స్థానిక ప్రైవేటు పాఠశాలల సంఘనేతలతో కలసి ఆయన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రశేఖర్‌రెడ్డి గెలుపుకోసం తాము కృషిచేస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించి కార్యాచరణ సిద్ధం చేసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

బస్సులు రాకపోవడంపై ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

గుడుపల్లె: స్కూళ్లు, కళాశాలలకు వెళ్లే సమయానికి అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక గుడుపల్లె రైల్వేస్టేషన్ క్రాస్‌లో చుట్టుపక్కల గ్రామాల నుంచి స్కూళ్లు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. కుప్పం నుంచి బిసానత్తం, సంగనపల్లె గ్రామాలకు వెళ్లే బస్సులు కళాశాలలు, పాఠశాలకు వెళ్లే సమయానికి రాకపోవడంతో అవస్థలు పడుతున్నామని వాపోయారు. గ్రామాల నుంచి ఉదయం, సాయంత్రం వెళ్లిరావడానికి, సకాలంలో బస్సులు లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఆందోళనకు దిగడంతో రెండుగంటల సేపు వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. సర్పంచ్ చెన్నరాయప్ప ఆర్టీసీ డిపో మేనేజర్‌తో సమస్యపై చర్చించారు. విద్యార్థుల సౌకర్యార్థం తగినన్ని బస్సులు ఏర్పాటు చేస్తామని డిపో మేనేజర్ హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

సీనియర్ పెన్షనర్లకు ఘన సన్మానం



సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్న అతిథులు

పలమనేరు: అఖిలభారత పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, పలమనేరు పరిరక్షణ సమితి, ఏపీఎన్జీఓల సంయుక్త ఆధ్వర్యంలో డెబ్బై అయిదేళ్లు పూర్తి చేసుకున్న సీనియర్ పెన్షనర్ల సన్మానం కార్యక్రమం స్థానిక ఏపీ ఎన్జీఓ హోమ్‌లో బుధవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ కుప్పుస్వామి, ఎస్టీఓ మునికృష్ణ, ఎస్‌బీఐ బీఎం హరిప్రసాద్, పీపీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులు, ఎన్జీఓ అధ్యక్షుడు ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ పెన్షనర్ల సంఘ రాష్ట్ర కార్యదర్శి గురురాజారావు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఉద్యోగులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 28లోపు రిటైర్డ్ ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్లను ఈకేవైసీ ద్వారా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం సంఘంలోని 25 మంది సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. సమావేశంలో సంఘ నేతలు ఆర్ముగం పిళ్లై, బాలసుబ్రమణ్యం, గుణశేఖర్, దొరస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి శాంతమ్మ, కుటుంబసభ్యులు విందుభోజనం ఏర్పాటు చేశారు.

బ్రహ్మారథంపై శివపార్వతుల విహారం



పుష్ప పల్లకిలో ఊరేగుతున్న ఆదిదంపతులు

బంగారుపాళెం: మొగిలి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదోరోజు బుధవారం సాయంత్రం మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ బ్రహ్మరథంపై భక్తులను కనువిందు చేశారు. ఉదయం స్వామి, అమ్మ మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం బ్రహ్మరథానికి పూజలు నిర్వహించి వివిధ రకాలపుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను అలంకార మండపం నుంచి తీసుకువచ్చి బ్రహ్మరథంపై కొలువుదీర్చారు. సతీసమేతులైన శ్రీకామాక్షమ్మ, మొగిలీశ్వరస్వామి బ్రహ్మరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో మొగిలి శివాలయానికి చేరుకోవడంతో జనసంద్రంగా మారింది. రథంపై బొరుగులు, మిరియాలు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. బ్రహ్మరథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. రథోత్సవానికి బెంగళూరు ఆక్స్‌ఫర్డ్ డెంటల్ కళాశాల యజమాని లేట్ నరసరాజు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో బంగారుపాళెం సీఐ నరసింహారెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీమొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మ వారికి పుష్పపల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మునిరాజ, వంశపారం పర్య ధర్మకర్త విజయకుమార్ తెలిపారు.

28లోపు పన్నులు చెల్లించండి

సదుం: సదుం పంచాయతీ పరిధిలో గృహ, నీటి పన్ను బకాయిలు, దుకాణ లైసెన్స్ ఫీజులను వెంటనే చెల్లించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ వరప్రసాద్ బుధవారం తెలిపారు. పన్నులు చెల్లింపునకు ఈనెల 28 వరకు గడువు ఇచ్చినట్లు చెప్పారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి తిరునాళ్ల



సదుం: అలంకరణలో అభయాంజనేయస్వామి

సదుం: మండలంలోని ఊటుపల్లె క్రాస్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తిరునాళ్ల నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేక పూజలు చేపట్టారు. సాయంత్రం వేదపండితుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. రాత్రి వీధినాటకం, చాందినీ బండ్ల ఊరేగింపు, కోలాటాలు, భజనలు చేశారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు



కోడిపందెం రాయుళ్ల అరెస్టు చూపుతున్న పోలీసులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని వెంకటదాసరపల్లె పంచాయతీ జూపల్లె వద్ద కోడిపందెం ఆడుతున్న ఐదుగురిని స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. జూపల్లె వద్ద బుధవారం కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం అందడంతో కల్లూరు ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డి సిబ్బందితో వెళ్లి దాడులు చేసి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు పందెం కోళ్లు, రూ.2540 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటి పన్ను వసూలుపై దృష్టి సారించండి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పులిచెర్ల(కల్లూరు): ఈనెల ఆఖరులోపు ప్రతి పంచాయతీలో ఇంటిపన్ను 80 శాతం తప్పక వసూలు చేయాలని ఎంపీడీఓ సుగుణమ్మ ఆదేశించారు. మండలంలోని కావేటిగారిపల్లె గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె సిబ్బందితో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నిర్దేశించిన సమయంలో విధులకు హాజరు కావాలన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5గంటల వరకు నిర్వహించే స్పందనలో అర్జీలను స్వీకరించి, వెంటనే వాటిని పరిష్కరించాలని సూచించారు. అనంతరం హౌసింగ్‌పై సమీక్షించారు.

28న జాతీయ సైన్స్ దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించాలని డీఈఓ విజయేంద్ర రావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సీఆర్‌సీ లెవల్‌లో ప్రతి పాఠశాల నుంచి మూడు ఉత్తమ ప్రదర్శనలు పంపాలన్నారు. సీఆర్‌సీ స్థాయిలో నిర్వహించే ప్రదర్శనలో గెలుపొందే విద్యార్థులకు బహుమతులు అందజేయాలని వెల్లడించారు.

ఒంటరి ఏనుగు హల్‌చల్

రామకుప్పం: మండలంలోని ఎస్.గొల్లపల్లి సమీపంలో ఒంటరి ఏనుగు హల్‌చల్ చేస్తోంది. మంగళవారం రాత్రి, బుధవారం సాయంత్రం ఆ ఏనుగు మామిడి తోటపై దాడి చేసి మామిడి కొమ్మలను విరిచేసినట్లు స్థానిక రైతులు తెలిపారు. అటవీ అధికారులు స్పందించి ఏనుగు దాడి నుంచి పంటలను కాపాడాలని కోరుతున్నారు.

బడుగు బలహీన వర్గాలకు సీఎం పెద్దపీట



పుంగనూరు: సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దళితనేతలు

పుంగనూరు: ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బడుగు, బలహీన వర్గాలకు అవకాశం కల్పించి, సమన్యాయపాలన పాటించిన సీఎం జగనన్న చిరకాలం వర్ధిల్లాలని దళిత సంఘం నాయకులు ఆకాంక్షించారు. బుధవారం వారు స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగుల అభివృద్ధి కోసం గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా బడుగుల అభివృద్ధికి జగనన్న కృషి చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీకి అండగా నిలబడి వచ్చే ఎన్నికల్లో జగనన్నను సీఎంను చేసుకుందామని కోరారు. కార్యక్రమంలో రాజు, కృష్ణప్ప, శంకరప్ప, అమర్, చిన్నరాయుడు, మునిరత్నం, లక్ష్మీనారాయణ, బాబు, హరిప్రసాద్, సురేష్, రామచంద్ర పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కుప్పంరూరల్: టమాటా, బంగాళదుంప సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయ శాస్త్రవేత్తలు నాగమణి, రాఘవేంద్ర, విజయలక్ష్మి చెప్పారు. బుధవారం పెద్దబంగారునత్తం, శెట్టిపల్లి గ్రామాలకు చెందిన రైతులకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగాకర్షణ బుట్టలు, జిగురట్టలతో టమాటా సాగు చేస్తే, చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవచ్చని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గడంతో పాటు సేంద్రియ ఎరువుల వాడకం పెరిగితే పంట దిగుబడితో పాటు భూసారం పెరుగుతుందని సూచించారు. ఉద్యానశాఖ ఏడీ కోటేశ్వరరావు మాట్లాడుతూ టమాటా, వంగ, బంతి, చామంతి వంటి అంటుకట్టిన మొక్కలు కావాలంటే సీఓఈకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. రాయితీలపై మొక్కలను సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి డింపుప్రియ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మిత్ర పురుగులతో వరి పంటకు మేలు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రొంపిచెర్ల: వరి పంటలో మిత్ర పురుగులను రైతులు కాపాడుకోవాలని ఏఈఓ ఖాదర్‌వలీ తెలిపారు. వైఎస్సార్ పొలంబడిలో కార్యక్రమంలో భాగంగా బుధవారం బోడిపాటివారిపల్లె గ్రామంలో వరిపంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ పంటల్లో పురుగుల నివారణకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేయడం వల్ల పొలంలో ఉన్న మిత్ర పురుగులు కూడా చనిపోతాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని క్రిమి సంహారక మందుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. అలాగే రెక్కల పురుగుల నివారణకు లింగాకర్షణ బుట్టలు పెట్టినా లాభం లేదన్నారు. దీని వల్ల వరిపొలంలో కాండం తొలిచే పురుగు లేదని తెలుసుకోవచ్చన్నారు. అయితే కొందరు రైతులు తెలుసుకోకుండా పంటకు క్రిమి సంహారక మందులు వాడుతున్నారని తెలిపారు. ఇది మంచి పద్ధతి కాదని సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ పంటలు సాగు చేయాలన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ సహాయకులు వెంకటరమణ నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళి



పుంగనూరు: ఉయ్యాలవాడ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ శరణ్, రఘునాథరెడ్డి, నారదరెడ్డి

పుంగనూరు: స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 176వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. రెడ్డిజన సంఘ నాయకులు డాక్టర్ శరణ్, గౌరవ అధ్యక్షుడు నారదరెడ్డి, రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. డాక్టర్ శరణ్ మాట్లాడుతూ పట్టణంలో ఉయ్యాలవాడ విగ్రహానికి అనుమతి ఇచ్చి ఆ ప్రాంతానికి యూఎస్‌ఆర్ సర్కిల్‌గా నామకరణం చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పేదలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డిజన సంఘ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పెద్దిరెడ్డి దాసంరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాగరాజారెడ్డి, నారాయణ, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

మంచి నిర్ణయాలు తీసుకోండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బాలరాజు

బైరెడ్డిపల్లె: విద్యార్థులు భవిష్యత్ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మండలంలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కెరియర్ గైడెన్స్ ప్రాజెక్ట్ ప్రతినిధి బాలరాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యం ఎంచుకోవాలన్నారు. 25 ఏళ్ల వయసు వరకు చదువుపై దృష్టి సారిస్తే జీవితకాలం సుఖసంతోషాలతో ఉండవచ్చన్నారు. భవిష్యత్‌లో ముందుకు వెళ్లాలంటే తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని, ఆ దిశగా ముందుకు సాగాలన్నారు. అనంతరం సైన్స్‌పై అవగాహన కల్పించారు. అలాగే వారి సంస్థ తరఫున ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సైన్స్ ఫర్ బెటర్ సొసైటీ ప్రతినిధి జగదీశ్వర్, స్కూల్ ప్రిన్సిపల్ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.